## క్లుప్తంగా

### నేడు ఎమ్మెల్యే పర్యటన

రేణిగుంట: వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా మైనారిటీ అధ్యక్షుడిగా నియమితులైన రేణిగుంటకు చెందిన షేక్ మహమ్మద్ రసూల్ సన్మాన కార్యక్రమం ఆదివారం రేణిగుంట పార్టీ కార్యాలయంలో జరగనుంది. ఈ కార్యక్రమానికి శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి హాజరవుతారన్నారు. తొలుత రేణిగుంట డాక్టర్ జనార్దన్ హాస్పిటల్ కూడలి నుంచి భారీ ర్యాలీ చేపట్టి అనంతరం పార్టీ కార్యాలయం వద్ద సభ జరుగుతుందని పార్టీ వర్గాలు వెల్లడించాయి.

### అభయ వేంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన అభయ వేంకటేశ్వరస్వామికి శనివారం వేదపండితు లు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా అభిషేకాలు చేపట్టారు. అనంతరం ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### నేడు మండల సర్వసభ్య సమావేశం

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఆదివారం ఉదయం 10 గంటలకు ఎంపీపీ మేకల సుబ్బలక్ష్మి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు తెలిపారు. దీనికి ప్రజాప్రతినిధులు, అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

### క్యూలైన్ల పరిశీలన



క్యూలైన్లను పరిశీలిస్తున్న అంజూరు తారక శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు శనివారం క్యూలైన్లను పరిశీలించారు. అడ్డదారిలో వెళ్లే దళారీలను కట్టడి చేశారు. అదేవిధంగా సామాన్య భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా క్యూలైన్లను క్రమబద్ధీకరించారు. ఎదురుగా వచ్చే భక్తులకు అడ్డంగా వెళ్లే దళారులకు అడ్డకట్ట వేశారు. అదేవిధంగా అక్కడ ఉన్న దేవస్థాన సిబ్బంది, సెక్యూరిటీ సిబ్బందికి అడ్డదారిన వచ్చే వారిపై కఠినంగా వ్యవహరించాలని తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### డీపీ చాక్లెట్ పరిశ్రమ మాదే.. కాదు మాది

వరదయ్యపాళెం: మండలంలోని కంచరపాళెం సమీపంలో ఉన్న డీపీ చాక్లెట్ పరిశ్రమను రెండు పంచాయతీల ప్రజలు మాదేనంటూ గొడవ పడుతున్నారు. ఈ చాక్లెట్ పరిశ్రమ చెల్లించే పన్ను కోసం రెండు పంచాయతీల మధ్య వివాదం కొనసాగుతోంది. తాజాగా శనివారం సాయంత్రం కంచరపాళెం, అరుదూరు గ్రామ పంచాయతీలకు చెందిన ప్రజల మధ్య వాగ్వాదానికి దారితీసింది. గత ఏడాదికిపైగా అటు కంచరపాళెం, ఇటు అరుదూరు గ్రామ పంచాయతీల సర్పంచులు తమ పరిధిలోకి చాక్లెట్ పరిశ్రమ వస్తుందని వేర్వేరుగా జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై నిర్ణయం తీసుకోవాల్సిన జిల్లా పంచాయతీ అధికారి నుంచి స్పందన రాకపోవడంతో సమస్య కొనసాగుతూనే ఉంది. తాజాగా అరుదూరు గ్రామ పంచాయతీ సర్పంచ్ ఈ విషయమై హైకోర్టులో వ్యాజ్యం వేశారు. అరుదూరు గ్రామ పంచాయతీ ప్రజలు శనివారం డీపీ చాక్లెట్ పరిశ్రమ వద్దకు వెళ్లగా కంచరపాళెం పంచాయతీకి చెందిన ప్రజలు కూడా అక్కడకు వెళ్లి అడ్డుకున్నారు. ఈ క్రమంలో కంచరపాళెం సర్పంచ్, అరుదూరు సర్పంచ్‌పై వరదయ్యపాళెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై ఎస్‌ఐ నాగార్జునరెడ్డి పూర్తి స్థాయిలో విచారణ చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

### అబాకస్‌తో సృజనాత్మకత



ఉత్తీర్ణత పొందిన విద్యార్థులు

రేణిగుంట: అబాకస్ నేర్చుకోవడం ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందుతుందని నాగార్జున స్కూల్ కరెస్పాండెంట్ భాస్కర్ రెడ్డి అన్నారు. రేణిగుంటలోని వారి స్కూల్లో శనివారం ధరణి అబాకస్ ఆధ్వర్యంలో మొదటి విడతలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు మెడల్స్‌ను ప్రదానం చేశారు. ధరణి అబాకస్ డైరెక్టర్ రవికుమార్, ధరణి అబాకస్ చైర్మన్ లావణ్య పాల్గొన్నారు.

### ఉగాది క్యాలెండర్ ఆవిష్కరణ

బుచ్చినాయుడుకండ్రిగ: స్థానిక ఎంఆర్‌సీ కార్యాలయంలో శనివారం ఎంఈవో రవీంద్రనాథ్ త్రైత సిద్ధాంత తెలుగు ఉగాది క్యాలెండర్ ఆవిష్కరించారు. త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి శ్రీకాళహస్తి సమితి అధ్యక్షుడు, హెచ్ఎం చింతసుబ్రమణ్యం, ఉపాధ్యాయులు వాసుదేవరావు, బంగారునాయుడు, సీఆర్పీలు కృష్ణయ్య, జయంతి, ఈశ్వరయ్య, వాసవి తదితరులు పాల్గొన్నారు.

# పౌష్టికాహారంతో రక్తహీనత దూరం

- మాతాశిశు మరణాలు నియంత్రణకు కృషి చేయండి
- ఆర్డీఓ కేఎస్ రామారావు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ కేఎస్ రామారావు



ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడి కార్యకర్తలు

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్): గర్భిణులు, బాలింతలు ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టికాహారాన్ని ప్రతిరోజు తీసుకోవాలని, తద్వారా రక్తహీనతను అధిగమించవచ్చని ఆర్డీఓ కె.ఎస్.రామారావు అన్నారు. శనివారం మండంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో నిర్వహించిన పోషణ పక్వాడ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు ఆరోగ్యంగా, సంతోషంగా ఉన్నప్పుడు మాత్రమే ఆరోగ్యవంతమైన బిడ్డను ప్రసవించగలవని సూచించారు. వారు మానసికంగా, శారీరకంగా ఆరోగ్యంగా ఉండాలని, వైద్యుల వద్దకు వెళ్లి పరీక్షలు చేయించుకోవాలన్నారు. మహిళల్లో రక్తహీనత అధికంగా ఉందని, అది తగ్గడానికి మంచి పౌష్టికాహారం తీసుకోవాలని కోరారు. అంగన్‌వాడీ కార్యకర్తలు మాతా శిశుమరణాలు తగ్గించేందుకు కృషి చేయాలని సూచించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పౌష్టికాహారాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తల ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ తరుణాక్షిరెడ్డి, హౌసింగ్ ఏఈ సుబ్రమణ్యం, కేవీబీపురం, తొట్టంబేడు, బుచ్చినాయుడుకండ్రిగ మండలాల అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే మండలంలోని బసవయ్యపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా సామూహిక సీమంతం వేడుకలను అంగన్‌వాడీ కార్యకర్త రేవతి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గర్భిణులకు పూలు, పండ్లు, స్వీట్లు అందజేశారు.

# రెండోరోజు చిందేపల్లివాసుల నిర్బంధం



చిందేపల్లి గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ శ్రీహరి



ఆందోళనకారులను తరలిస్తున్న పోలీసులు

ఏర్పేడు: దారి సమస్యను పరిష్కరించాలని విన్నవించడానికి ప్రభుత్వ కార్యాలయాల వద్దకు వెళ్లకుండా రెండోరోజు శనివారం మండలంలోని చిందేపల్లి గ్రామస్తులను పోలీసులు గ్రామ నిర్బంధం చేశారు. శ్రీకాళహస్తి మండలంలోని ఎలక్ట్రో స్టీల్ కాస్టింగ్స్ లిమిటెడ్ ఫ్యాక్టరీ యాజమాన్యం ఈ నెల 18న చిందేపల్లి గ్రామస్తులు వెళ్తున్న ఆర్‌అండ్‌బీ రోడ్డుకు అడ్డంగా గోడను నిర్మించడం విదితమే. శుక్రవారం తిరుపతిలోని కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి కలెక్టర్‌కు తమ గోడును వెళ్లబోసుకోవడానికి బయలుదేరగా పోలీసులు వారిని అడ్డుకున్నారు. శనివారం ఉదయం 7 గంటలకు పోలీసులు భారీగా చిందేపల్లికి చేరుకుని గ్రామస్తులను ఎక్కడా వెళ్లకుండా గ్రామ నిర్బంధం చేశారు. ఈ క్రమంలో జనసేన పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ వినూత చిందేపల్లికి చేరుకుని గ్రామస్తులతో మాట్లాడారు. గ్రామస్తులను వెంటబెట్టుకుని కర్మాగారం వద్ద గోడ కట్టిన ప్రాంతంలో ధర్నాకు దిగారు. వినూత, పలువురు ఆందోళనకారులను పోలీసులు జీపుల్లో బుచ్చినాయుడుకండ్రిగ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

# క్రమం తప్పకుండా టీకాలు వేయండి



వైద్యసిబ్బందికి సూచనలు ఇస్తున్న డాక్టర్ శాంతకుమారి

ఏర్పేడు: క్రమం తప్పకుండా వ్యాధి నిరోధక టీకాలు వేయాలని ఇమ్యునైజేషన్ జిల్లా అధికారి డాక్టర్ శాంతకుమారి అన్నారు. శనివారం మండలంలోని సీతారాంపేట, మన్నసముద్రం గ్రామాల్లో జరిగే వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. అలాగే రికార్డులు, పిల్లల రిజిస్టర్లు పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ముందుగా వ్యాధి నిరోధక టీకాలు వేసే పిల్లలను గుర్తించాలన్నారు. టీకాలు వేసే తేదీ, సమయం, స్థలాన్ని వారి తల్లులకు తెలియజేయాలని, టీకాల నిర్వహణలో జిల్లా 4వ స్థానంలో ఉందని తెలిపారు. వైద్య సిబ్బంది కష్టించి మొదటి స్థానానికి తీసుకుని రావాలని సూచించారు. రక్తహీనత కలిగిన గర్భిణులను గుర్తించాలని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ జుబేర్, సూపర్‌వైజర్లు మురళి, జ్యోతి, సుబ్బరాయుడు, చంద్రశేఖర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# కల్యాణ వెంకన్నకు ఊంజల్ సేవ



ఊంజల్ సేవలో ఉభయ నాంచారులతో వెంకన్న

నారాయణవనం: పద్మావతీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఉభయ నాంచారుల సమేతుడై శనివారం సాయంత్రం గంట పాటు ఊంజల్ సేవలో సేద తీరారు. శనివారం ఉదయం సుప్రభాత సేవతో స్వామిని మేల్కొల్పి నిత్య పూజా కైంకర్యాలను నిర్వహించి అర్చనలు చేశారు. ఉదయం నుంచే ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను అందుకున్నారు. సాయంత్రం నిత్య కైంకర్యాలు అందుకున్న స్వామి శ్రీదేవి, భూదేవి సమేతంగా మకర తోరణ తిరుచ్చి వాహనాన్ని అధిరోహించి ఆలయ ప్రాకారంలో ఊరేగారు. అనంతరం ఆస్థాన మండపంలో వేద, నాద, గాత్ర కచ్చేరీలతో గంట పాటు ఊంజల్ సేవ నిర్వహించారు. రాత్రి 9 గంటలకు స్వామికి ఏకాంత సేవను ఆలయ అర్చకులు నిర్వహించారు. ఏర్పాట్లను ఆలయ అధికారి నాగరాజు, సహాయకులు భరత్, భద్రతా జమేదార్ విజయకుమార్‌లు పర్యవేక్షించారు.

### దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాళహస్తి: పట్టణంలోని రాజీవ్‌నగర్ కాలనీలో ఉన్న ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ బాలికల ప్రతిభా పాఠశాలలో 2023–24 విద్యాసంవత్సరానికి 8వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం(ఎంపీసీ, బైపీసీ)లో ప్రవేశాలకు గిరిజన బాలికలు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ డాక్టర్ వి.సుధాకర్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. 8వ తరగతిలో 45 సీట్లు, ఇంటర్మీడియట్ ఎంపీసీలో 45 సీట్లు, బైపీసీలో 45 సీట్లు నింపడానికి ఏప్రిల్ 24వ తేదీ ప్రవేశ పరీక్ష మెరిట్ ద్వారా కౌన్సిలింగ్ నిర్వహించి ఎంపిక చేస్తామన్నారు. అడ్మిషన్ పొందిన విద్యార్థులకు ఉచిత వసతి, భోజన సౌకర్యాలతో పటు కార్పొరేట్ స్థాయి విద్య అందించబడుతుందన్నారు. వార్షిక ప్రణాళిక విద్యతో పాటు జేఈఈ మెయిన్స్, ఎంసెట్, నీట్, నిట్‌కు ప్రత్యేక కోచింగ్, స్టడీ మెటీరియల్ అందజేయనున్నట్లు తెలిపారు. పాఠశాలలో ప్రవేశం పొందడానికి గుంటూరు, బాపట్ల, పల్నాడు, నెల్లూరు, ప్రకాశం, కడప, నంద్యాల, తిరుపతి, చిత్తూరు, కర్నూలు, శ్రీసత్యసాయి, అన్నమయ్య, అనంతపురం జిల్లాలకు చెందిన ఎస్టీ బాలికలు మాత్రమే అర్హులన్నారు. దరఖాస్తు చేసుకోవడానికి ఏప్రిల్18 చివరి తేదీ అని, ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 24న నుంటుందన్నారు. వివరాలకు8330905221, 9866445530 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

### ఎన్‌ఎంఎంఎస్‌లో పల్లమాల విద్యార్థుల ప్రతిభ

బుచ్చినాయుడుకండ్రిగ: గత నెలలో నిర్వహించిన జాతీయ స్థాయి నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్ పరీక్షలో మండలంలోని పల్లమాల జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. పాఠశాలలో 8 వ తరగతి చదువుతున్న కిరణ్‌తేజ, రూపశ్రీ, పవన్, చరణ్‌తేజ, ఉత్తమ మార్కులు సాధించారని ప్రధానోపాధ్యాయురాలు గాయత్రి తెలిపారు. కంచనపుత్తూరు ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థిని టీ.లక్ష్మి ఎంపికైనందని ప్రధానోపాధ్యాయులు జయప్రకాష్ తెలిపారు.

### హాస్టల్లో సరస్వతీ పూజ

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలోని బీసీ బాలుర హాస్టల్లో పదో తరగతి విద్యార్థులు శనివారం సరస్వతీ పూజ చేశారు. కొవ్వొత్తులతో ఓంకార ప్రతిమ ముందు జ్యోతిని వెలిగించి పూజలు చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీకాళహస్తి డివిజన్ అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ చంద్రశేఖర్, వార్డెన్ రామయ్య ఆశీర్వాదాలు తీసుకున్నారు. అనంతరం ఏపీ బీసీ సంఘం జిల్లా యువజన అధ్యక్షులు కిరణ్‌కుమార్, వాసుకుమార్, చినబాబులు విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులకు వీడ్కోలు పలికారు.

# చిరు ధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం







మాట్లాడుతున్న ఎంపీడీఓ ప్రేమ్‌రాజ్ కుమార్, చిరుధాన్యాలతో చేసిన వంటకాలను ప్రదర్శిస్తున్న మహిళలు, పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న సోమలత

శ్రీకాళహస్తి రూరల్: చిరు ధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఎంపీడీఓ ప్రేమ్ రాజ్‌కుమార్ అన్నారు. శనివారం స్త్రీశక్తి భవనంలో చిరుధాన్యాల మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో రాగులు, సజ్జలు, ప్రధాన ఆహారంగా తీసుకునేటప్పుడు ఎలాంటి ఆరోగ్య సమస్యలు ఉండేవి కావన్నారు. ఎక్కువకాలం కూడా జీవించేవారని గుర్తు చేశారు. ప్రస్తుతం జంక్ ఫుడ్, వివిధ రకాల ఆయిల్ ఫుడ్స్ తినడం వల్ల 20 ఏళ్లకే గుండెపోటుతో మృతి చెందుతున్నారని చెప్పారు. అంతేకాకుండా వివిధ రకాల అనారోగ్యాలకు గురి కావాల్సి వస్తోందన్నారు. వైఎస్సార్ క్రాంతి పథం ఏరియా కో–ఆర్డినేటర్ డాక్టర్ దాంగేయాదవ్ మాట్లాడుతూ చిరు ధాన్యాలను ప్రధాన ఆహారంగా తీసుకోవడం వల్ల రక్తహీనత నుంచి బయట పడటంతోపాటు షుగర్ లెవల్స్ సక్రమంగా ఉండి డయాబెటీస్ బారిన పడకుండా ఉంటారని తెలిపారు. ఏపీఎం మాట్లాడుతూ చిరుధాన్యాల ఆవశ్యకతను ప్రతి వీవో లీడర్లు డ్వాక్రా మహిళలతో సమావేశం నిర్వహించి తప్పనిసరిగా వారికి అవగాహన కల్పించాలని సూచించారు. రాష్ట్రముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు రాగిజావ పంపిణీ చేసే కార్యక్రమాన్ని ప్రారంభించారని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ మండల నాయకుడు చెంగలరాయలు, సీసీలు రజనీకాంత్, శ్రీనివాసులు, మాదవయ్య, గంగులప్ప పాల్గొన్నారు.



విద్యార్థులకు పౌష్టికాహారం అందజేస్తున్న కెలాగ్స్, శ్రీసిటీ ప్రతినిధులు

**పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం**

రేణిగుంట: సమతుల పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సొంతమవుతుందని తండ్లం సర్పంచ్ పాడి సోమలత అన్నారు. తండ్లం అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ చిన్నారులు, గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారాన్ని తీసుకుని ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అనిత, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

**విద్యార్థులకు పౌష్టికాహారం పంపిణీ**

సత్యవేడు: శ్రీసిటీలోని చెరివి పంచాయతీ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో 'బ్రైట్ స్టార్ట్' (ఉజ్వల ఆరంభం) కార్యక్రమాన్ని కెలాగ్స్ కంపెనీ ప్లాంట్ లీడర్ బోస్లే, శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్(కస్టమర్‌రిలేషన్) రమేష్‌కుమార్, శ్రీసిటీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. రోజూ ఉదయం విద్యార్థులకు పాలు, సాయి ష్యూర్ న్యూట్రిషన్ పౌడర్‌తో చాకోస్ కలిపిన పౌష్టికాహారం ఇవ్వనున్నారు. బోస్లే మాట్లాడుతూ కెలాగ్స్ సంస్థ కార్పొరేట్ సామాజిక బాధ్యత చర్యల్లో భాగంగా తమ ఎన్జీఓ బాగస్వామి సాయి అన్న పూర్ణ ట్రస్టుతో కలసి విద్యార్థుల ఆరోగ్య పరిపుష్టికి, బడిబయటి పిల్లల సంఖ్యను తగ్గించేందుకు 'బ్రైట్ స్టార్ట్' కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే ఇరుగుళం, మాధనపాళెం పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు వివరించారు. నేడు చెరివి పాఠశాలలో ప్రారంభించామని తెలిపారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ పౌష్టికాహారం పిల్లల ఎదుగుదలకు తోడ్పడుతుందన్నారు.

# మహిళా సంఘాల అభ్యున్నతే ధ్యేయం



శ్రీకాళహస్తి : వైఎస్సార్ ఆసరా మూడవ విడత పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

శ్రీకాళహస్తి: మహిళా సంఘాల అభ్యున్నతే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని కమిషనర్ బాలాజీనాయక్ అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ ఆసరా మూడవ విడత పంపిణీ కార్యక్రమాన్ని శనివారం ఏలూరు జిల్లా దెందులూరులో బటన్ నొక్కి ప్రారంభించారు. అందులో భాగంగా శ్రీకాళహస్తి పురపాలకసంఘ కార్యాలయంలో మహిళా సంఘాల సభ్యులు వర్చువల్ విధానంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగాన్ని వీక్షించారు. అనంతరం పురపాలకసంఘ కమిషనర్ బాలాజీనాయక్ మాట్లాడుతూ శ్రీకాళహస్తి పురపాలకసంఘ పరిధిలో 836 సంఘాలు ఉండగా 7,670 మంది సభ్యులు ఉన్నట్లు తెలిపారు. ఆయా సంఘాల ఖాతాల్లో రూ.7.20 కోట్లు మూడవ విడత ఆసరా లబ్ధి చేకూరినట్లు చెప్పారు. ఈ సందర్భంగా మహిళలు థ్యాంక్యూ సీఎం సార్ అంటూ తమ అభిమానాన్ని చాటుకున్నారు. అలాగే ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డికి కూడా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సీఎంఎం ప్రసాద్, సీఓలు కావమ్మ, అమ్మాజీ, అజీజ్ ఉన్నీసా, ఆర్పీలు, మెప్మా సంఘ సభ్యులు, సమాఖ్య పదాదికారులు శివపార్వతి, ముంతాజ్‌బేగం తదితరులు పాల్గొన్నారు.

# పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం



గురుకుల పాఠశాలను తనిఖీ చేస్తున్న న్యాయమూర్తులు బేబీరాణి, కృష్ణప్రియ

శ్రీకాళహస్తి: పరిసరాల పరిశుభ్రతతోనే మంచి ఆరోగ్యం లభిస్తుందని శ్రీకాళహస్తి న్యాయస్థాన సీనియర్ సివిల్‌జడ్జి బేబీరాణి, జూనియర్ సివిల్ జడ్జి కృష్ణప్రియ అన్నారు. పట్టణంలోని బాలికల గురుకుల పాఠశాల, రెసిడెన్సియల్‌ను శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం వసతులపై హాస్టల్ వార్డెన్, ప్రిన్సిపల్, విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. భోజన నాణ్యతను అడిగి తెలుసుకున్నారు. అనంతరం న్యాయమూర్తులు మాట్లాడుతూ గౌరవ జిల్లాజడ్జి ఆదేశాల మేరకు హాస్టల్ తనిఖీ చేసినట్లు తెలిపారు. హాస్టల్‌లో భోజన వసతులు బాగున్నాయని కితాబిచ్చారు. అలాగే విద్యార్థులకు పరిశుభ్రంగా వసతులు ఉండాలన్నారు. విద్యార్థులకు ఏవైనా సమస్యలు ఉంటే 100 లేదా 15100కు ఫోన్ చేసి తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో 2వ పట్టణ ఎస్‌ఐ మహేష్, కోర్టు సిబ్బంది, పారాలీగల్ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఆదర్శవంతంగా విద్యావ్యవస్థ

- ఉత్తరాఖండ్ బృందం ప్రశంస





రేణిగుంట బాలికోన్నత పాఠశాలలో ఎస్‌సీఈఆర్‌టీ బృందం

రేణిగుంట: ఆంధ్రప్రదేశ్‌లో ఆదర్శవంతంగా విద్యావ్యవస్థను తీర్చిదిద్దారని ఉత్తరాఖండ్‌కు చెందిన ఎస్‌సీఈఆర్‌టీ (స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్) బృందం ప్రశంసించింది. శనివారం రేణిగుంట బాలికోన్నత పాఠశాలను ఆ బృందం సందర్శించింది. కె.భరద్వాజ్ సారథ్యంలో శివకుమార్, విజయ్‌ప్రసాద్, లింగ్వాల్, షాలినీ భట్, శకుంతల బండారీ, అనుజ మెతానీ, నీలిమతో కూడిన బృందం పాఠశాలలో అమలవుతున్న విద్య, సహ విద్య కార్యక్రమాలను పరిశీలించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటి వరకు విజయవాడ, నెల్లూరు, తిరుపతి, రేణిగుంటలోని ప్రభుత్వ పాఠశాలలను సందర్శించామన్నారు. నాడు–నేడు కింద అధునాతన వసతులు సమకూర్చడం అభినందనీయమని తెలిపారు. స్కూల్ ప్రాంగణంలో మొక్కల పెంపకం, క్యాంపస్ సుందరీకరణ, తరగతి పరిశుభ్రత, కంప్యూటర్ ల్యాబ్ వినియోగం, అటల్‌టింకరింగ్ ల్యాబ్ అద్భుతంగా ఉన్నాయని కొనియాడారు. ప్రభుత్వం అందించిన బైజూస్ ట్యాబులు, వాటి వినియోగంతో పిల్లల అభ్యసనంలో వచ్చిన మార్పులు ప్రశంసనీయమని చెప్పారు. ఈ స్థాయిలో విప్లవాత్మకమైన పథకాలు దేశంలో ఎక్కడా అమలు కావడంలేదని వెల్లడించారు. అనంతరం విద్యార్థులు ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ కార్యక్రమం ద్వారా వేస్ట్ మెటీరియల్‌ను ఉపయోగించి తయారు చేసిన వస్తువుల ప్రదర్శనను వీక్షించి అభినందనలు తెలిపారు. తాము పరిశీలించిన అంశాలన్నీ డాక్యుమెంటరీ రూపంలో తయారు చేసి తమ ప్రభుత్వానికి నివేదిస్తామని వివరించారు.

# విభిన్న ఆలోచనతోనే నూతన ఆవిష్కరణలు



విద్య, వైజ్ఞానిక ప్రదర్శనను తిలకిస్తున్న ఎంపీడీఓ రత్నమ్మ

రేణిగుంట: విద్యార్థులు చిన్నతనం నుంచే కేవలం బట్టీ చదువులకు అలవాటు పడకుండా విషయాన్ని పూర్తిగా అవగాహన చేసుకుని చదవడం ద్వారా విభిన్న ఆలోచన ధోరణి ఏర్పడి నూతన ఆవిష్కరణల వైపు తీసుకెళ్తాయని రేణిగుంట ఎంపీడీఓ రత్నమ్మ అన్నారు. మండలంలోని గాజులమండ్యం శ్రీసాయి గణేష్ విద్యాలయంలో శనివారం జరిగిన విద్యావైజ్ఞానిక ప్రదర్శన కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. విద్యార్థులు రూపొందించిన సైన్స్ ప్రయోగ ప్రదర్శనలను తిలకించారు. 230 ప్రదర్శనలను విద్యార్థులు రూపొందించి ప్రదర్శించారు. కార్యక్రమంలో సర్పంచ్ గంగారి రమేష్, స్కూల్ యాజమాన్యం చెంచురెడ్డి, జువ్వల ధనంజయరెడ్డి, కుమార్‌రాజు పాల్గొన్నారు.

# విద్యార్థులకు పరీక్ష సామగ్రి వితరణ



సామగ్రిని అందజేస్తున్న ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం

శ్రీకాళహస్తి: పదో తరగతి విద్యార్థులు ఒత్తిడి వదలి పరీక్షలు రాయాలని ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం అన్నారు. పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం పదో తరగతి విద్యార్థులకు సిపాయి విద్యాదీవెన కింద పరీక్షా సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పదవ తరగతి పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత సాధించి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలన్నారు. విద్యార్థులకు రాష్ట్రం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, నియోజకవర్గంలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అనేక కార్యక్రమాల్లో అండదండలు అందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ విశ్వనాథ్, ఇన్‌చార్జ్ హెచ్ఎంలు శివకుమార్, ఇంగ్లీష్ ఉపాధ్యాయులు, సీఆర్పీ, నాయకులు రత్నంరెడ్డి, పెరుమాల్‌రెడ్డి, బుజ్జిరెడ్డి, కృష్ణారెడ్డి, వడ్లతాంగల్ బాలాజీప్రసాద్‌రెడ్డి, మురళీకృష్ణారెడ్డి, భరత్‌కుమార్‌రెడ్డి, లక్ష్మీపతిరెడ్డి, కంఠా ఉదయ్‌కుమార్, మధురెడ్డి, దాము, మునికృష్ణారెడ్డి, చంద్రారెడ్డి, దీపక్‌రెడ్డి, హేమంత్‌కుమార్‌రెడ్డి, పుదూరు శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వేలంతో రూ.20 లక్షల ఆదాయం

నారాయణవనం: మండలంలోని ఆదాయ వనరులకు శనివారం నిర్వహించిన వేలం పాటల ద్వారా రూ.20,11,600 ఆదాయం లభించిందని ఈవోపీఆర్డీ డాక్టర్ వేణయ్య, ఈవో ప్రభురావు తెలిపారు. నారాయణవనం పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన వేలం పాటలో వారపు సంత రూ 11.01 లక్షలకు, ఆటో స్టాండ్ రూ.2.03 లక్షలకు, టూరిస్ట్ బస్టాండ్ రూ.4.11 లక్షలకు, దినసరి కూరగాయల మార్కెట్ రూ.85 వేలకు, జంతు వధశాల రూ.19,600కు గుత్తేదారులు పాడుకున్నారని ఈవో ప్రభురావు తెలిపారు. పాలమంగళం దక్షిణంలో 6 వాణిజ్య గదులు ఏడాది పాటు అద్దెకు నిర్వహించిన వేలం పాటలో రూ.1.92 లక్షల ఆదాయం లభించిందని ఈవోపీఆర్డీ వేణయ్య తెలిపారు. వేలం పాటలో సర్పంచ్‌లు శారదాగణేషన్, ప్రేమలతారాజారెడ్డి, వార్డు సభ్యులు, పంచాయతీల కార్యదర్శులు, గుత్తేదారులు పాల్గొన్నారు.

# సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీపీఓ రాజశేఖర్ రెడ్డి

సత్యవేడు: సేంద్రియ వ్యవసాయాన్ని పెంచేలా రైతులను ప్రోత్సహించాలని డీపీఓ రాజశేఖర్ రెడ్డి వ్యవసాయ అధికారులను ఆదేశించారు. ఆయన శనివారం సత్యవేడులోని ఎస్‌డబ్ల్యూపీసీ (చెత్త నుంచి సంపద తయారీ) కేంద్రం వద్ద పిచ్చాటూరు మండలంలోని వెంగళత్తూరు, సిద్దిరాజు కండ్రిగ, సత్యవేడులోని మదనంబేడు, రాజగోపాలపురం పంచాయతీ సర్పంచులు, వార్డు మెంబర్లు, గ్రీన్ అంబాసిడర్లుకు నిర్వహించిన 'జగనన్న స్వచ్ఛసంకల్పం శిక్షణా తరగతుల'ను డీపీఓ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాల్లో పంచాయతీ కార్యదర్శుల పర్యవేక్షణ తప్పనిసరిగా ఉండాలన్నారు. సత్యవేడు, మేనకూరు, పెరుమాళ్లలో ట్రైనింగ్ సెంటర్లు ఏర్పాటు చేశామన్నారు. గ్రామాల్లో ప్రతి ఇంటా మరుగుదొడ్డి నిర్మించుకోవాలని, పేడ దిబ్బలు ఇళ్లమధ్య లేకుండా దూరంగా ఉండేలా చర్యలు చేపట్టాలని సచివాలయ కార్యదర్శులను ఆదేశించారు. జగనన్న స్వచ్ఛసంకల్పం జిల్లా రిసోర్స్ పర్సన్ జి.రవికుమార్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కే.సుశీల్‌కుమార్ రెడ్డి, సర్పంచులు మంజుల, రమేష్, మధుసూదన్‌రావు, పిచ్చాటూరు ఈఓపీఆర్డీ శ్రీదేవి, సత్యవేడు ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ మునిరవికుమార్, సచివాలయ కార్యదర్శులు, హరీష్, సునిల్, వెంకటేష్ తదిరులు పాల్గొన్నారు.